19వ వసంతంలోకి

# చురకలు

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల

బుధవారం 30 ఏప్రిల్ 2025 | పేజీలు : 8

## ఆధార్ కార్డు లాగా.. భూమికి భూ దార్ కారు

- ప్రతి గ్రామానికి పరిపాలన అధికారి నియామకం
- భూ భారతి చట్టంతో సాదా బైనామాల పరిష్కారం
- భూమి సమస్యలపై ఉచిత న్యాయ సేవలు
- జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్



**.చురకలు విలేకరి, రాయికల్, ఏప్రిల్ 29 :** గతంలో గ్రామకంఠం, ఆబాది స్థలాలు పొందుపరచలేదని ప్రస్తు తం వ్యవసాయ, నాలా, వ్యవసాయేతర భూముల వివరాలను బట్టి మనిషికి ఆధార్ కార్డు మాదిరి భూమి కలిగిన ప్రతి ఒక్కరికి భూధార్ కార్డును పంపిణీ చేపట్టనున్నట్లు జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. మంగళవారం రాయికల్ పట్టణంలోని పద్మశాలి కళ్యాణ ఫంక్షన్ హాల్ లో రెవెన్యూ అధికారులు ఏర్పాటుచేసిన కార్యక్రమంలో భూ భారతి చట్టం లోని వివిధ -2లో

# కల్వకుంట్ల + జువ్వాడి = అభివృద్ధి



- ఇటు కల్వకుంట్ల... అటు జువ్వాడి
- శాంతియుత ధోరణిలో పయనం
- భేషజాలు లేని రాజకీయం
- కోరుట్ల అభివృద్ధిలో కీలకం

**.చురకలు ప్రతినిధి కోరుట్ల, ఏప్రిల్,29 :** ఒకరిమీద ఒకరు బురద జల్లుకోవడం... మాటకు మాట... రచ్చ రచ్చ... ఇదంతా కూడా రాజకీయాల్లో షరామామూలే. ముఖ్యంగా ఈ రోజుల్లో రాజకీయం చేయాలంటే ఆషామాషీ కాదు. తమ కుర్చీలు కాపాడుకుంటూ నే... అపొజిషన్ లీడర్లకు చుక్కలు చూపెట్టగలిగే నేర్పరితనం ఉండాలి. పొద్దున లేచిన దగ్గర్నుంచి రాత్రి పడుకునే వరకు స్కెచ్చులు వేస్తూనే ఉండాలి. అలా ఐతేనే రాజకీయ చదరంగంలో విజయం... లేదంటే చతికిలపడిపోవాల్సిందే. ఇలాంటి రొచ్చులో ఇటీవల కోరుట్ల రాజకీయం కొత్త పుంతలు తొక్కినట్లు కనిపిస్తోంది. ఎన్నికలైనా, ఇంకేదైనా రాష్ట్ర రాజకీయం ఒక తీరుగా ఉంటే... కోరుట్ల రాజకీయం మరో తీరుగా ఉంటుంది. అదే కోవలో రాజకీయ రంగాన మరోసారి కోరుట్ల పేరు తనదైన ముద్ర వేసుకుంది. ఇటీవలి పరిణామాలు సునిశితంగా పరిశీలిస్తే ఈ విషయం బోధపడుతుంది. తెలంగాణ ఉద్యమంతో ఉవ్వెత్తున ఎగిసిపడిన గులాబీ జెండా రెపరెపలతో బీఆర్ఎస్ పార్టీ ప్రజలకు దగ్గరైంది. ఆ క్రమంలో కోరుట్ల నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించిన కల్వకుంట్ల విద్యాసాగర్ రావును ప్రజలు అక్కున చేర్చుకున్నారు. ఎమ్మెల్యేగా పలుమార్లు వరుసగా గెలిపించి అభిమానం చాటుకు న్నారు. ఆయన కూడా నొప్పింపక తానొవ్వక అనే రీతిలో పబ్లిక్ లీడర్ ఇమేజ్ సొంతం చేసుకున్నారు. అయితే మొన్నటి సాధారణ ఎన్నికల్లో తాను తప్పుకుని తనయుడు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కు బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యే టికెట్ ఇప్పించి గెలిపించుకున్నారు. సంజయ్ కూడా తండ్రి బాటలో నడుస్తూ నిత్యం ప్రజల్లో ఉంటూ శభాష్ అనిపించుకుంటున్నారు. ఇప్పటికే ఫ్రెండ్లీ ఎమ్మెల్యేగా పేరు తెచ్చుకున్నారు. ఇక కాంగ్రెస్ నుంచి ప్రాతినిధ్యం వహించి మాజీ మంత్రిగా పనిచేసిన స్వర్గీయ జువ్వాడి రత్నాకర్ రావు తనయులు జువ్వాడి నర్సింగరావు, జువ్వాడి కృష్ణారావు కూడా తమదైన స్టైల్‌లో ముందుకెళు తున్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ...పార్టీ కార్యకర్త లను ప్రోత్సహిస్తూ పలు కార్యక్రమాలు చేపడుతున్నారు. కోరుట్ల ఎమ్మెల్యేగా డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఏవిధంగా ప్రతినిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటున్నారో... అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ ఇమేజ్ పెరిగేలా జువ్వాడి బ్రదర్స్ కూడా ప్రజా నాయకులుగా సేవలంది స్తున్నారు. పలుమార్లు ఎన్నికల సమరాన ఎమ్మెల్యేగా విజయం దక్కనప్పటికీ... ఈసారి కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండటంతో... రాష్ట్రస్థాయిలో తమకున్న పరిచయాలు, పలుకుబడితో జువ్వాడి బ్రదర్స్ కోరుట్ల నియోజకవర్గ అభివృద్ధికి పూర్తిస్థాయిలో విశేషమైన సేవలంది



స్తుడటం గొప్ప విషయం. అటు కల్వకుంట్ల, ఇటు జువ్వాడి అన్నట్లుగా కోరుట్ల రాజకీయం రసవత్తరంగా మారింది. అయితే ఎక్కడ కూడా తప్పటడుగులు పడకుండా ఇరువర్గాలు బాగా మేనేజ్ చేస్తున్నాయి. ఎమ్మెల్యేగా డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ప్రజా సేవకుడిగా ఎలాగైతే ముందుకెళుతున్నారో... కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్‌గా జువ్వాడి నర్సింగరావు, -2లో

### పకడ్బందీగా, పారదర్శకంగా

## భూ భారతి చట్టం అమలు

**-బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**



**.చురకలు ప్రతినిధి కరీంనగర్ ఏప్రిల్ 29 :** భూ భారతి నూతన ఆర్ఓఆర్ చట్టాన్ని పకడ్బందీగా, పారదర్శకంగా అమలు చేస్తామని, రైతులు కార్యాలయాల చుట్టూ తిరిగే పనిలేదని, గ్రామీణ రెవెన్యూ వ్యవస్థను అలోపేతం చేస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. సైదాపూర్ మండల కేంద్రం లోని విశాల సహకార పరపతి సంఘం కళ్యాణమండపంలో, చిగురుమామిడి మండల కేంద్రంలోని మహాలక్ష్మి ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన భూభారతి అవగాహన సదస్సులకు మంత్రి హాజరయ్యారు. మొదటగా సైదాపూర్ మండల కేంద్రంలో విశాల సహకార పరపతి సంఘం నూతన భవనాన్ని, కళ్యాణమంటపాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. అనంతరం ఇదే మండపంలో ఏర్పాటు చేసిన భూభారతి నూతన రెవిన్యూ చట్టం అవగాహన సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ భూమి ఒక గౌరవంగా -2లో



## ధర్మపురిలో నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తాం

**-ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



**.చురకలు విలేకరి, ధర్మపురి,, ఏప్రిల్ 29:** ధర్మపురి పట్టణంలో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. మంగళవారం ధర్మపురి మున్సిపాలిటీలో పరిధిలోని 5,13 వ వార్డుల్లో అధికారులు మండల నాయకులతో కలిసి పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వార్డుల్లో త్రాగు నీరు,డ్రైనేజీ, విద్యుత్తు వంటి తదితర సమస్యల పైన అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధర్మపురి మున్సిపాలిటీలో ఈ రోజు 5 మరియు 13 వార్డుల్లో పర్యటించి వార్డు సమస్యలను స్వయంగా అడిగి తీసుకోవడం జరిగిందని, ధర్మపురి మున్సిపాలిటీలో మంచినీటి సరఫరాలో ఎటువంటి ఇబ్బందులూ లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.,నీటి అవసరం ఎక్కడైనా ఉంటే నూతనంగా బోర్వెల్స్ వేయిస్తామ న్నారు. గత ప్రభుత్వ పాలకులు తలపున గోదావరి ఉన్న ధర్మపురి ప్రాంతానికి నీటిని అందించడంలో పూర్తిగా విఫలం అయ్యారని ఆరోపించారు. ధర్మపురికి ల్యాండ్ మార్క్ గా ఉన్న చింతామణి చెరువు కట్టను హైదరాబాద్లో ట్యాంక్ బండ్ మాదిరిగా అభివృద్ధి చేస్తామని,గోదావరి నుండి చింతామణి చెరువులో నీటిని నింపడానికి ఉన్న పైప్ లైన్ మరమ్మతులు చేయిస్తామని,సాయంత్రం వాకింగ్ చేసే వారికి లైట్లు,ఓపెన్ జిమ్ వంటి అవసరాలను సమస్యలను తన దృష్టికి వచ్చాయని, వాటిని కూడా త్వరలోనే పరిష్కరిస్తామని,ప్రజల ద్వారా ఎన్నుకోబడిన నాయకుడు ప్రజా సమస్యలు పరిష్కారం చేసినప్పుడే ప్రజలు ఆ నాయకుడిని నమ్ముతారని,గోదావరిలో మురికి నీరు చేరకుండా -2లో

## కల్వకుంట్ల + జువ్వాడి= అభివృద్ధి

**మొదటి పేజీ తరువాయి....**కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడిగా జువ్వాడి కృష్ణారావు అదే పంథాను అనుసరిస్తున్నారు. సీఎంఆర్ ఎఫ్, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ తదితర ప్రభుత్వ పథకాలను ఎమ్మెల్యేగా డాక్టర్ సంజయ్ ఎంత చిత్తశుద్ధితో ప్రజలకు దగ్గర చేస్తున్నారో... అదే విధంగా జువ్వాడి బ్రదర్స్ కూడా ఆయా పథకాల అమలులో ప్రజలకు చేదోడు వాదోడుగా నిలుస్తున్నారు.మొత్తానికి అటు కల్వకుంట్ల... ఇటు జువ్వాడి కోరుట్ల నియోజకవర్గ అభివృద్ధిలో పాలుపంచుకుంటున్నారు. ఇరు వర్గాలు కూడా ఎలాంటి భేషజాలు లేకుండా ప్రజాసేవే పరమావధిగా ముందుకెళుతున్నారు.కోరుట్ల ఎమ్మెల్యేగా డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ మాటతీరుతో అందర్నీ ఆకట్టుకుంటారు. జనాల్లో తిరుగుతూ పేరు పెట్టి పిలిచే సన్నిహితుడిగా మెలుగుతారు. ఏ పని ఉన్నా సరే తన దగ్గరకు రావాలంటూ స్టేట్‌మెంట్ ఇస్తారు. ఎమ్మెల్యేగా కాకుండా ఒక ఆత్మీయుడిగా కలిసిపోతారు. ఇక శుభ కార్యాలకు వెళ్లి ఆశీర్వదిస్తారు. అశుభ కార్యాల సందర్భంలో బాధితులను పరామర్శించి భరోసా ఇస్తారు. అదే కోవలో జువ్వాడి బ్రదర్స్ తీరు కూడా అంతే. తండ్రి రాజకీయ వారసత్వం పుణికిపుచ్చుకుని ప్రజా నాయకులుగా అందుబాటులో ఉంటున్నారు. అటు బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే ఉన్నా సరే... తమ వంతుగా ప్రజలకు ఎంత మేర సేవ చేసే అవకాశముందో అంతకు మించి పనిచేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండటంతో... మంత్రుల తో, అధికారులతో ఎప్పటికప్పుడూ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధిలో ఎమ్మెల్యేకు ధీటుగా దూసుకెళుతున్నారు. సాధారణంగా బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు ఉన్నచోట కాంగ్రెస్ పార్టీ నాయకులకు పొసగడం లేదు. దాదాపు రాష్ట్రవ్యాప్తంగా పలు నియోజకవర్గాల్లో ఇరు వర్గాల మధ్య డిష్యుం డిష్యుం అనే పరిస్థితి కనిపిస్తోంది. అభివృద్ధి పనుల విషయంలో... ప్రభుత్వ పథకాల అమలులో కొట్టుకునే దుస్థితి దాపురిం చింది. కానీ కోరుట్ల నియోజకవర్గంలో అటు కల్వకుంట్ల, ఇటు జువ్వాడి పనితీరు అభివృద్ధికి పట్టం కడుతోంది. భేషజాలు లేని రాజకీయంతో ఇరువురు కూడా ఎవరి పని వారు చేసుకుంటూ ముందుకెళుతున్నారు.ఆ మధ్య మెట్‌పల్లి లో జరిగిన ఒక వార్డుసభలో ఎమ్మెల్యే సంజయ్ ను కాంగ్రెస్ కార్యకర్యలు నిలదీశారు. అయితే అక్కడే ఉన్న జువ్వాడి నర్సింగరావు కలుగజేసుకుని వారిని శాంతింపజేసి ఎమ్మెల్యేతో కలిసి కార్యక్రమం కొనసాగించారు. ఆ రోజు వాస్తవానికి పెద్ద గొడవ అవుతుందేమో అనుకున్నారు. కానీ ఇద్దరూ నాయకుల సంయమనం దానికి ఫుల్ స్టాప్ పెట్టేసింది. ఆ తర్వాత అడపాదడపా చాలా పబ్లిక్ ప్రోగ్రామ్స్‌లో ఆ ఇద్దరూ నాయకులు వేదికను పంచుకున్నారు. నియోజకవర్గ అభివృద్ధి ఏజెండాగా నాయకులు పనిచేస్తే ఎలాంటి గొడవ ఉండదు. ఏదైనా వ్యక్తిగతంగా తీసుకుంటేనే సమస్య మొదలవుతుంది. ఇప్పటికైతే కోరుట్ల నియోజకవర్గంలో అటు కల్వకుంట్ల... ఇటు జువ్వాడి బ్రదర్స్ సంయమనం పాటిస్తూ ఎవరికి తోచిన విధంగా వారు అభివృద్ధి కార్యక్రమాల్లో పాలుపంచుకుంటున్నారు. మున్ముందు కూడా భేషజాలకు పోకుండా ఇరువర్గాలు కూడా ఇదే పద్ధతి కొనసాగించి కోరుట్ల నియోజక వర్గానికి మంచి పేరు తీసుకురావాలని కోరుకుందాము. అంతేకాదు ఈ ప్రజానాయకులను ఇతర నియోజక వర్గాల లీడర్లు కూడా అనుసరిస్తారని ఆశిద్దాము.

## ధర్మపురిలో నీటి...

**మొదటి పేజీ తరువాయి....** సివరెజ్ ప్లాంట్ ఏర్పాటుకు కూడా 17 కోట్ల రూపాయలు మంజూరు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి కలిసి వినతి పత్రాన్ని ఇచ్చినట్లు ధర్మపురికి శాశ్వత మంచి నీటి పరిష్కారం చూపే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కల్లెడ రాజశేఖర్,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంఘనబట్ల దినేష్, ఉపాధ్యక్షుడు వేముల రాజేశ్,పట్టణ కాంగ్రెస్ అద్యక్షుడు చిపిరిశెట్టి రాజేశ్, నాయకులు సింహారాజు ప్రసాద్,అప్పం తిరుపతి, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నాడు అగ్నికి ఆహుతి... నేడు పశువులకు గ్రాసం...

**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ ఏప్రిల్ 29. :** ఒకప్పుడు పశుగ్రాసాన్ని నిప్పు పెట్టే రైతులే నేడు పశువులకు గ్రాసంగా మారింది. అలనాడు వరి కూలీల ద్వారా కోసి అనంతరం పంజా కొట్టడం లేక బంతి కొట్టడం జరిగేది. ఆ గడ్డిని పశువులకు వాడకంలో వచ్చేది. రాను రాను వ్యవసాయంలో పలు మార్పులు చోటు చేసుకున్నాయి. హార్వెస్టర్ల ద్వారా వరిని కోసిన అనంతరం ఆ వరి గడ్డి పూర్తిగా వరి మల్ల లోనే వదిలి పెట్టేవారు. అనంతరం రైతులు దానికి నిప్పు పెట్టి కాల్చేవారు. ప్రస్తుతం ఆ గడ్డి వృధా పోకుండా రైతులు బేలర్ ట్రాక్టర్ ద్వారా చుట్టలు చుట్టి దాన్ని పశుగ్రాసంగా మార్చుకున్నారు. ఆ చుట్టలు ఒక ఎకరానికి సుమారు 35 నుండి 40 చుట్టలు అవుతాయి. పారిశ్రామిక ప్రాంతమైన గోదావరిఖని ,ఎన్టిపిసి, 8 ఇంక్ లైన్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఈ పశుగ్రాసానికి భలే డిమాండ్ ఉంది. పారిశ్రామిక ప్రాంతమైన ఈ ప్రాంతాల్లో ఒక్కోకట్ట 70 రూపాయల నుండి 100 రూపాయల వరకు అమ్ముతుంటారు. ఈ పశుగ్రాసాన్ని కోసినా అనంతరం బేలర్ తో చుట్టలు చుట్టి ట్రాక్టర్ల ద్వారా పట్టణ ప్రాంతాలకు పరిశ్రమ ప్రాంతాలకు తరలించి అక్కడ విక్రయిస్తుంటారు. గతంలో వృధాగా పోయిన వరిగడ్డి నేడు డిమాండ్తో అమ్మడం జరుగుతుంది.. అలాగే కొందరు ఆ గడ్డి కట్టలను తమ ఇళ్ళ రేకులపై ఎండవేడికి రాకుండా వేసుకోవడం జరుగుతుంది. ప్రస్తుతం వరిగడ్డి వృధా పోకుండా పశుగ్రాసానికి ఎంతగానో ఉపయోగపడుతుంది..

**వరిగ్రాసం పూర్తిగా వినియోగంలోకి వస్తోంది...**

ఒడ్నాల సంపత్ ట్రాక్టర్ డ్రైవర్. గతంలో మాదిరిగా వరిగ్రాసం వృధా పోకుండా వినియోగంలోకి వస్తోందని కమాన్ పూర్ మండలం సిద్దిపల్లి గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ ఒడ్నాల సంపత్ తెలియజేశారు. బేలర్ వారి చుట్టూ ట్రాక్టర్ వచ్చిన తర్వాత వరి ధాన్యాన్ని చుట్టలు చుట్టి పశుగ్రాసంగా వినియోగంలోకి వస్తోంది. అలాగే పారిశ్రామిక ప్రాంతాల్లో డిమాండ్‌గా దీన్ని అమ్మడం జరుగుతుంది.

# ఆధార్ కార్డు లాగా.. భూమికి భూ దార్ కార్డు

**మొదటి పేజీ తరువాయి....**అంశాలను కలెక్టర్ రైతులకు, ప్రజలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన ఆర్వోఆర్ భూ భారతి చట్టం ద్వారా సాదా బైనామా దరఖాస్తులకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. 14 రకాల అంశాలతో భూభారతిలో భూ వివరాలు పొందుపరిచి ఉన్నాయని ప్రతి గ్రామంలో గ్రామ పరిపాలన అధికారిని నియమించి రెవెన్యూ సమస్యలను పరిష్కరిస్తా మన్నా రు. పరిష్కారం కానటువంటి పేద రైతుల భూ సమస్యలకు ప్రభుత్వ నుండి న్యాయవాదులు అందుబాటులో ఉంటారని ఉచితంగా నిరుపేదలకు న్యాయ సేవలు పొందవచ్చు అన్నారు. ఎమ్మార్వో, ఆర్డీవో రెండు అంచెల వ్యవస్థలో భూములపై ఫిర్యాదు చేయవచ్చని ప్రభుత్వ భూముల భద్రత నూతన భూభారతి చట్టంతోనే సాధ్యమవుతాయని వివరించారు.తెల్ల కాగితాల పై కొనుగోలు చేసిన సాధా బైనామా భూముల పట్టాలు అందించాలని గత ప్రభుత్వం తీసుకున్న దరఖాస్తుల పరిష్కారం పై ధరణిలో అవకాశం లేనందున హై కోర్టు స్టే విధించిందని, పెండింగ్ సాధా బైనామా పరిష్కారం కోసం భూ భారతి చట్టం సెక్షన్ 6 క్రింద ఆర్డిఓ లకు బాధ్యతలు అందించిందని అన్నారు.చిన్న సన్న కారు రైతులు 2014 కంటే ముందు కొనుగోలు చేసిన గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ భూములకు మాత్రమే సాధా బైనామా పట్టా లభిస్తుందన్నారు. గడిచిన 12 ఏళ్ళలో సాధా బైనామా భూముల అనుభవంలో ఉన్న వారికి మాత్రమే దరఖాస్తులు పరిష్కారం అవుతాయన్నారు.వారసత్వం లేదా వీలునామా ద్వారా భూమిపై హక్కుల సంక్రమిస్తే తహసిల్దార్ విచారణ జరిపి రికార్డుల్లో మ్యుటేషన్ చేస్తారని, నిర్ణీత గడువు 30 రోజుల లోగా మ్యుటేషన్ పూర్తి చేయకుంటే ఆటోమేటిక్ గా మ్యుటేషన్ జరుగుతుందన్నారు.భూముల రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ ముందు తప్పనిసరిగా భూమి సర్వే జరిపించి మ్యాప్ తయారు చేయాల్సి ఉంటుందన్నారు.భూముల విస్తీర్ణం మార్పులు చేర్పులకు అవకాశం ఉందని తెలిపారు.

**-పకడ్బందీగా భూభారతి చట్టం అమలు.. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్...**

రైతుల సలహాలు,అధికారుల ఆలోచనలు, న్యాయవ్యవస్థ పరిశీలనలో భూ భారతి చట్టం రూపుదిద్దుకొని పకడ్బందీగా అమలవుతుందని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి వ్యవస్థ వల్ల ఇబ్బంది పడని రైతు ఎవరూ లేరని అన్నారు. 15 నెలల నుంచి క్షుణ్ణంగా అధ్యయనం చేసి పేద ప్రజలకు న్యాయం జరిగేలా భూ భారతి చట్టం ప్రవేశ పెట్టారని అన్నారు.భూ భారతి చట్టం ప్రవేశం పెట్టడమే కాకుండా అధికారులను గ్రామాలకు పంపి భూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నామని అన్నారు.

అనంతరం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ అధికారి పి మధుసూదన్,తహసిల్దార్ అబ్దుల్ ఖయ్యూం, ఎంపీడీవో చిరంజీవి,మున్సిపల్ కమిషనర్ మనోహర్,మండల పంచాయతీ అధికారి సుష్మ,సింగిల్ విండో చైర్మన్లు ఏనుగు ముత్యం రెడ్డి, రాజలింగం,ఏనుగు మల్లారెడ్డి,రాజారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ గణేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గన్నే రాజారెడ్డి,మాజీ కోఆప్షన్ సభ్యులు మోఖిద్, నాయకులు కోల శ్రీనివాస్,మరి పెల్లి శ్రీనివాస్, సామల్ల వేణు,కాటిపెల్లి గంగారెడ్డి, మాజీ సర్పంచులు రైతులు, తదితరులు పాల్గొన్నారు.

### పకడ్బందీగా, పారదర్శకంగా

# భూ భారతి చట్టం అమలు

**మొదటి పేజీ తరువాయి....**భావించే రైతుకు ధరణి వచ్చిన తర్వాత మనశ్శాంతి లేకుండా పోయిందని అన్నారు. ధరణి తెచ్చిన భూ వివాదాల కారణంగా రైతుల ఆవేదన, ఆక్రోశం తహసిల్దార్ పై దాడి చేసే వరకు వెళ్లిందని అన్నారు. ధరణి వ్యవస్థ వల్ల రైతు తన భూమిని తాను అమ్ముకునే పరిస్థితి లేదని అన్నారు. అధికారులను గత ప్రభుత్వం దొంగలుగా చిత్రీకరించి రాత్రికి రాత్రి వందల ఎకరాల భూములను వారి పేరు పైకి బదిలాయించుకున్నారని తెలిపారు. 30 సంవత్సరాల కింద ఉన్న భూములు విక్రయించి వెళ్లిపోయిన వారి పేర్లు ధరణిలో వచ్చాయని, దీనివల్ల అసలైన రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ సమస్యలన్నీ పరిష్కరించాలని సంకల్పంతో, భవిష్యత్తులో ఎలాంటి భూ సమస్యలు ఉండకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం భూ భారతి నూతన రెవిన్యూ చట్టాన్ని అమల్లోకి తెచ్చిందని తెలిపారు. జూన్ 2 నుండి ఈ చట్టం ద్వారా సమస్యలు పరిష్కరిస్తామని అన్నారు. ఈ చట్టం ద్వారా రైతులు ఎదుర్కొంటున్న ప్రతి సమస్య పరిష్కారం అవుతుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరి భూమికి భూధార్ సంఖ్య కేటాయిస్తామని తెలిపారు. భూమికు సంబంధించిన రికార్డులన్నీ ప్రతి సంవత్సరం డిసెంబర్ 31న రికార్డు చేయడం జరుగుతుందని వెల్లడించారు. చెప్పిన పని చేయలేదని సాకుతో విఆర్ఓ వ్యవస్థను రద్దు చేశారని, భూముల హక్కులను కాపాడేందుకు గ్రామీణ రెవిన్యూ వ్యవస్థను బలోపేతం చేస్తామని తెలిపారు. భూభారతి చట్టాన్ని పారదర్శకంగా, పకడ్బందీగా అమలు చేస్తామని అన్నారు. తెలంగాణలో రైతులకు చెందిన ప్రతి భూ సమస్య పరిష్కారం అవుతుందని అన్నారు. ప్రభుత్వ ఆస్తులు ప్రభుత్వ అవసరాలకు మాత్రమే వినియోగించాలని తెలిపారు. ఎవరైనా భూకబ్జాలకు పాల్పడి ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, తిరిగి ఆ భూములను ప్రజా అవసరాలకు వినియోగిస్తామని అన్నారు. రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగుతున్నాయని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో అత్యంత నిరుపేదలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, దఫదఫాలుగా పేదలందరికీ ఈ పథకం వర్తింపజేయాలని అధికారులకు సూచించారు. హుస్నాబాద్ నియోజకవర్గం లో తాగు, తాగునీటి అవసరాలు పూర్తిగా పరిష్కరిస్తామని అన్నారు. సహకార పరపతి సంఘాలు సమర్థవంతంగా పనిచేస్తూ రైతు సమస్యలను పరిష్కరించాలని ఆకాంక్షించారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ భూభారతి చట్టం ద్వారా అధికారాల వికేంద్రీకరణ జరిగిందని, అధికారుల బాధ్యత జవాబుదారితనం పెరిగిందని తెలిపారు. గ్రామ పరిపాలన అధికారాల వ్యవస్థ బలోపేతం కానుందని అన్నారు. సాదా బైనామాతో సాగు చేసుకుంటున్న వారికి భూభారతిలో న్యాయం జరగనుందని తెలిపారు. ధరణిలో నియమనిబంధనలు లేకపోవడంతో అధికారులకు, ప్రజలకు మధ్య వాగ్వాదాలు చోటు చేసుకున్నాయని తెలిపారు. భూభారతి ద్వారా స్పష్టమైన నియమాలను ప్రభుత్వ రూపొందించిందని, భూ వివాదాల పరిష్కారానికి ఈ చట్టంలో అన్ని వివరాలు పొందుపరిచారని తెలిపారు. అనువంశికంగా వచ్చే భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించి, విచారించి వివాదాలకు తావు లేకుండా వారసత్వం హక్కు కల్పిస్తారని తెలిపారు. రెండచెల అప్పీలు వ్యవస్థ ఉండడం వల్ల రైతుకు న్యాయం జరగకపోతే ఉన్నతాధికారులను ఆశ్రయించవచ్చని తెలిపారు. కోర్టులకు వెళ్ళవలసిన అవసరం ఉండదని అన్నారు. ఆరు నెలల కింద ప్రభుత్వం తహసిల్దార్, ఆర్డీవోలకు అధికారాలు ఇవ్వడం ద్వారా జిల్లాలోని 9 వేలకు పైగా భూ సమస్యల దరఖాస్తులు పరిష్కరించామని తెలిపారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయి, ఆర్టీవోలు మహేశ్వర్, రమేష్ బాబు, సహకార సంఘం చైర్మన్ కొత్త తిరుపతిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ సుధాకర్, డీసీఓ రామానుజాచార్య, డీఏవో భాగ్యలక్ష్మి,పాల్గొన్నారు.

## వేసవికాల ఉచిత క్రీడా శిక్షణా శిబిరాన్ని ప్రారంభించిన జి.యం. నరేంద్ర సుధాకర రావు

**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ ఏప్రిల్ 29.:** వేసవికాల ఉచిత క్రీడా శిక్షణా శిబిరాన్ని చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకర రావు అన్నారు. రామగుండం-3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాల వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2025-26 సంవత్సరానికి గాను స్థానిక రాణి రుద్రమదేవి క్రీడాప్రాంగణం నందు పద్దెనిమిది సంవత్సరాల లోపు ఉన్న సింగరేణి ఉద్యోగుల పిల్లల కోసం నిర్వహించనున్న వేసవికాల ఉచిత క్రీడా శిక్షణా శిబిరాన్ని మంగళవారం రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకర రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు శారీరక దారుఢ్యం కోసమే కాకుండా, మానసిక ఉల్లాసానికి కూడా దోహదపడతాయని అన్నారు. ఉద్యోగుల సంక్షేమంలో భాగంగా సింగరేణి సంస్థ ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తుందనీ, ఉద్యోగుల కోసమే కాకుండా వారి పిల్లల కోసం కూడా ఇలాంటి కార్యక్రమాలు గత కొద్ది సంవత్సరాలుగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కావున వేసవి సెలవుల్లో నిర్వహిస్తున్న ఇలాంటి క్రీడా శిక్షణా శిబిరాన్ని పిల్లలందరూ సద్వినియోగం చేసుకొని, ఆయా క్రీడా విభాగాలలో నైపుణ్యం పెంపొందించుకోవాలని కోరారు. దీనిలో భాగంగా ఫుట్ బాల్, వాలీబాల్,విలువిద్య, హాకీ క్రీడా విభాగాలలో 25 రోజుల పాటు శిక్షణా శిబిరాన్ని నిర్వహించడం జరుగుతుందని అన్నారు. క్రీడా మైదానంలో ఉన్న సదుపాయాలను పూర్తిగా వినియోగించుకోవాలని కోరారు. శిక్షకులు హాజరైన పిల్లలలో క్రీడా నైపుణ్యాన్ని పెంచాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న వేసవి కాల ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకుని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్లు, త్రాగునీరు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని తెలిపారు.గుర్తింపు ప్రాతినిధ్య సంఘాల నాయకులు వై.వి.రావు, పాల్గొన్నారు.

# బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన వెంకటేశ్వర స్వామి ఆలయం

**-నేటి మొదలు రెండు రోజుల పాటు ఉత్సవాలు**



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం ఏప్రిల్ (29) :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలోని అతి పురాతన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. బుధవారం అలివేలు మంగ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవానికి ముస్తాబ యింది. మహోత్సవంలో భాగంగా బుధవారం స్వామి వారికి అభిషేకం, విష్వక్సేనారాధన, పుణ్యాహవచనము, రక్షాభంధనం, అంకురారోపణం, స్థాపిత మండపారాధన, ధ్వజారోహణం, గరుడ కళ్యాణం,తీర్థప్రసాద వితరణ కార్యక్ర మాలు నిర్వహించినట్లు ఆలయ అర్చ కుడు వెంకటేశ్వర చార్యులు తెలిపారు. అలాగే గురువారం స్థాపిత మండపారా ధన, పంచసూక్త హోమము, భేరితాడన పూజవిధి, బలిహరణము, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అలాగే శుక్రవారం స్థాపిత మండ పారాధన, స్థాపిత హోమము స్వామి వారి ఎదురుకోలు, "శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి కళ్యాణం అన్నదానం, మహా పూర్ణాహుతి, ఆశీర్వచనం. సాయంత్రం రథయాత్ర, బలిహరణం, ఉంజల్ సేవ, ఏకాంతసేవ నిర్వహించినట్లు తెలిపారు. శుక్రవారం స్వామివారి కళ్యాణం అనంతరం గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయనున్నారు. గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు లోక రమణ రెడ్డి, ధర్మారపు సుధాకర్, బోడ రమేష్ తదితరులు తెలియజేశారు.

# జనసమితి పార్టీ ఆవిర్భావ దినోత్సవం



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం ఏప్రిల్ (29) :** తెలంగాణ జన సమితి పార్టీ 7వ ఆవిర్భావ దినోత్సవ సందర్భం గా జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కేంద్రంలో కోత్తబస్టాండ్ ప్రాంగణంలో తెలంగాణ జన సమితి పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం మంగళవారం జరిగింది. తెలంగాణ జన సమితి పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇంచార్జి కంతి మోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.గ్రామ శాఖ పార్టీ అధ్యక్షులు ఏశాల గంగారెడ్డి జండా ఆవిష్కరించారు. అనంతరం జనసమితి పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇంచార్జీ కంతి మోహన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల సమస్యల పై పోరాటం లో తెలంగాణ జన సమితి పార్టీ ముందు ఉంటుంది, నిరంతరం ప్రజా సమస్య లపై, విద్యార్థి-నిరుద్యోగ సమస్యపై పోరాటం చేస్తున్న ఏకైక పార్టీ తెలంగాణ జన సమితి పార్టీ అని మరియు రైతుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తూ రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న పార్టీ తెలంగాణ జన సమితి అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టిజెయస్ జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకుంట శంకర్ , ఇబ్రహీంపట్నం మండలం అధ్యక్షులు కంతి రమేష్,మాజీ ఎంపీటీసీ రాజారెడ్డి , నాయకులు కాట దశరథ్ రెడ్డి, కంతి లింగారెడ్డి, కంతి ప్రశాంత్, గోవర్ధన్ , ఒడ్డే మోహన్,బద్దీ రాములు,జిల్లా రాజేందర్, నాగులపేట నరసయ్య, పెద్దరాజ్యం, గజ్జ రమేష్, గజ్జ శేఖర్, కంతి రాకేష్, కల్లెద స్వామి, కంతి గంగాధర్, కచ్చకాయల వసంత్, పత్తి రెడ్డి శ్రీనివాస్, గట్టు మల్లయ్య, ఎండి. సలీం, హన్మాండ్లు, గుమ్మడి నర్సయ్య, గడసంద రవి, నాచుపల్లి తిరుపతి, కనక ముత్తయ్య, కనక పోషయ్య,గొర్రె శ్రీనివాస్,సుంకే రాజన్న,తిమ్మని బావయ్య,కనక రాజేశ్వర్,సున్నం పెద్ద ముత్తన్న, నాచుపల్లి తిరుపతి,కనక వెంకట్, మరియు తెలంగాణ జన సమితి యువ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ప్రణాళికతో చదివితే లక్ష్యాలు సాధించవచ్చు

**-జగిత్యాల పట్టణ సీ ఐ వేణుగోపాల్**




**జగిత్యాల ప్రతినిధి ఏప్రిల్ (29) :** విద్యార్థులు ప్రణాళికతో చదివియువత ఉన్నత లక్ష్యాలను సాధించాలని జగిత్యా ల పట్టణ సీఐ సూరం వేణుగోపాల్ అన్నారు.ఎర్త్ ఫౌండేషన్ యువతను బాధ్యతాయుతమైన స్థానంలో నిలుపుతుందనివేణు గోపాల్అన్నారు.ఎర్త్ ఫౌండషన్ ఆధ్వర్యంలో జగిత్యాలలో నిర్వహిస్తున్న పోలీసు, డిఫెన్స్ పరీక్షల ఉచిత శిక్షణ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు "ఉచిత షూ" పంపిణీ కార్యక్రమం ఫౌండేషన్ డైరెక్టర్ ముద్రబోయిన రాజు మంగళవారం చేశారు.ముఖ్య అతిథిగా జగిత్యాల టౌన్ సిఐ సూరం వేణుగోపాల్ పాల్గొన్నారు .సి ఐ మాట్లాడుతూ విద్యార్థులు దేశ రక్షణ రంగంలో ఉద్యోగాలు చేయుటకు ముందుకు వచ్చేలా చేసిన ఎర్త్ ఫౌండేషన్ కు అభినందనలు తెలిపారు .ఈ ఫౌండేషన్ ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణ కార్యక్రమం అందరూ సద్విని యోగ పరుచుకోవాలని తెలిపారు. మరొక అతిథి అబాకస్ నిపుణులు గంగాధర్ పాల్గొని జగిత్యాల యువత కోసం ఆర్మీ శిక్షణ ఇవ్వడం మంచి శు భపరిణామని, తనవంతుగా విద్యార్థుల కు గణితంలో మెళకువలు నేర్పేల సహకారం అందిస్తానని తెలిపారు.ఈ కార్యక్రమం లో డైరెక్టర్ మంగళంపల్లి రాజు, సీనియర్ కో ఆర్డినేటర్ ఆంజనేయులు,నాగరాజు, ట్రైనర్ అనిల్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మృతి

**-నివాళులార్పించిన మాజీ మంత్రి జీవన్ రెడ్డి**



**జగిత్యాల ప్రతినిధి ఏప్రిల్ (29) :** జగిత్యాల మార్కెట్ మాజీ చైర్మన్, తక్కళ్లపెల్లి మాజీ సర్పంచ్ దశరథ రెడ్డి గుండెపోటుతో మృతి చెందారు.విషయం తెలుసుకున్న తాజా మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి తక్కళ్లపెల్లి వెళ్లి పార్థివా దేహాన్ని సందర్శించి నివాళు లార్పించారు.జగిత్యాల రూరల్ మండలం తక్కళ్లపెల్లి గ్రామంలో మాజీ మార్కెట్ కమిటీ చేర్మన్ దశరథ రెడ్డి గుండెపోటుతో మరణించగా మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.జీవన్ రెడ్డి వెంట నాయకులు గాజంగి నందయ్య, ముస్కు దామోదర్ రెడ్డి, ధర రమేష్ బాబు, జున్ను రాజేందర్,చందా రాధాకిషన్, అంకతి గంగాధర్, గోంటి మొగిలి, గోళ్ల తిరుపతి, నారాయణ రెడ్డి, ప్రభాకర్,నర్సింహా రెడ్డి, గోపాల్ రెడ్డి, తదితరులున్నారు.

## విద్యాసాగర్ జి ఎంతో అభివృద్ధి చేశారు



**చురకలు ప్రతినిధి, మెట్ పల్లి , ఏప్రిల్ 29 :** బోయవాడకు చెందిన మెట్పల్లి డిపో రిటైర్డ్ డ్రైవర్ ఆర్మూర్ రాజేష్ మహారాష్ట్ర మాజీ గవర్నర్ మాజీ ఎంపీ మెట్పల్లి నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే సిహెచ్ విద్యాసాగర్ రావు కి ఆయనపై ఉన్న గౌరవంతో అభిమానంతో వారికి లెటర్ రాయడం జరిగింది. ఇందులో భాగంగా వారు మెట్పల్లి ప్రాంతం ఎంతో అభివృద్ధి చేశారని కులమతాలకు అతీతంగా అభివృద్ధి చేశారని గతంలో తాను పేదరికంతో బాధపడుతుంటే ఆర్టీసీలో ఉద్యోగం ఇప్పించారని అలాగే తన కుమారుని వారి సంస్థలో మంచి ఉద్యోగం ఇచ్చి విచారని ఇప్పుడు చాలా సంతోషంగా ఉన్నామని వారి దయతో ఆనందంగా కుటుంబ సభ్యుల సుఖసంతోషాలతో ఉన్నామని అదేవిధంగా వారి కుమారుడు సిహెచ్ వికాస్ రావు వారి అడుగుజాడలు నడిచి ఎమ్మెల్యేగా గెలవాలని కోరుతున్నారు అని లెటర్ ద్వారా మాజీ ఎమ్మెల్యే సిహెచ్ విద్యాసాగర్ రావు కి వారి ఆత్మీయ కోరికను లెటర్ ద్వారా పంపించారు .

## ప్రతి నెల రెండున జీతాలు చెల్లించాలి



**చురకలు ప్రతినిధి,మెట్ పల్లి , ఏప్రిల్ 29 :** మున్సిపల్ లేబర్ యూనియన్ వారు మున్సిపల్ కమిషనర్ కి వినతిపత్రం అందించారు. తమ ప్రతి నెల రెండో తారీఖున మా కార్మికుల జీతాలు చెల్లించాలని మా సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ కు వినతిపత్రం ఇచ్చినట్లు కార్మిక అధ్యక్షులు తెలిపారు రాష్ట్ర ఏఐటీయూసీ యూనియన్ వారు రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నెల రెండో తారీఖున జీతం ఇవ్వాలని సి డి ఎం ఓ కి వినతిపత్రం ఇవ్వడం జరిగిందని లేని యెడల మూడో తారీకు నుండి సమ్మె చేయడం జరుగుతుందని రాష్ట్ర నాయకులు ఆదేశాల మేరకు మీకు వినతిపత్రం ఇవ్వడం జరిగిందని అన్నారు.

## నార్మల్ డెలివరీకి సిబ్బంది కృషి చేయ్యాలి

**-ఇబ్రహీంపట్నం పి హెచ్ సి ఆకస్మిక తనిఖీలో జగిత్యాల జిల్లా వైద్యధికారి ప్రమోద్**



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం ఏప్రిల్ (29) :** నార్మల్ డెలివరీ కీ వైద్యసిబ్బంది కృషి చేయ్యలని జగిత్యాల జిల్లా వైద్యధికారి ప్రమేద్ అన్నారు. మంగళవారం ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం లో డియం అండ్ హెచ్ ఓ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్బంగా ఆసుపత్రిలో మంగళవారం జరిగిన సాదరణ కానుపును,పాపను పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతు సిబ్బంది సాదరణ కానుపుకు సహకారాన్ని అందచేసి ప్రతి గ్రామంలో అవగాహన కల్పించాలన్నారు.అనతరం పలు రికార్డులను పరిశీలించారు. ఈకార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్, అనిల్ కుమార్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు .

# చిన్నాపూర్ ఎస్సి కాలనిలో నీటి సమస్యకు పరిష్కారం

**-బోర్ వేయించిన ఎమ్మెల్యే లక్ష్మణ్ కుమార్**

**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఏప్రిల్ 29 :** జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం చిన్నాపూర్ లో ఎస్సి కాలనిలో నీటి సమస్య ఉండగా బోర్ వేయించి ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ బోర్ వేయించి తాగు నీటి సమస్యకు పరిష్కారం చూపారు.చిన్నాపూర్ గ్రామంలో ఎస్సి కాలానిలో త్రాగే నీటి సమస్య ఉందని బోర్ వేయించాలని ఎస్సి, ఒడ్డెర కాలానివాసులు ప్రభుత్వ విప్ అడ్లూరి



లక్ష్మణ్ కుమార్ కు విన్నవించగా స్పందించినా ఆయన మంగళవారం బోర్ వేయించారు.ఈ సందర్భంగా బుగ్గారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేముల సుభాష్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.ఈ సందర్భంగా చిన్నాపూర్ గ్రామస్థులు, ఎస్సి కాలనీ వాసూలు ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కు కృత్షతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో చందయ్యా పల్లె మాజీ సర్పంచ్ ఎన్నం కిషన్ రెడ్డి, నాయకులు పూజల కనుకయ్య,బుర్ర రమేష్,గట్టు గంగయ్య,గడ్డం నారాయణ వర్మ, దమ్మ లక్ష్మణ్, రంజిత్, నర్సయ్య, నాగరాజు, రాజేశం, ఇడగొట్టు నర్సమ్మ, భారతి,కొడిమ్యాల రాజయ్య,కలమడుగు ఇందయ్యా, శ్రీనివాస్, గజ్జెల ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

# మహిళాడిగ్రీ కాలేజ్‌లో ఉత్సాహంగా 2025 జోష్

**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఏప్రిల్ 29 :** జగిత్యాల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఉల్లాసంగా.. ఉత్సాహంగా 2025జోష్ వార్షికోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ సందర్భంగా కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ కె. రామకృష్ణ మాట్లాడుతూ, "మన కళాశాల స్వయం ప్రతిపత్తి హెూదాను సాధించడంతో విద్యార్థులకు మంచి నాణ్యమైన విద్యను అందించగలుగుతున్నామని, మంచి ప్రణాళిక, నిరంతర శ్రమ, కృషి అంకితభావంతో విద్యార్థులు ఉన్నత స్థాయి లక్ష్యాలను చేరుకోవచ్చన్నారు. కళాశాలలో చదువుతున్న రోజులు హ్యాపీ డేస్ లాంటివని, చదువుతో పాటు సమాంతరంగా కెరీర్ సంబంధించిన వాటికి సన్నద్ధమవుతూ ఉండాలన్నారు. త్వరలో విద్యార్థుల అవసరాల మేరకు మంచి డిమాండ్ ఉన్న పి.జి. కోర్సులు మొదలు పెట్టవచ్చన్నారు. త్వరలో జరుగబోయే సెమిస్టర్ పరీక్షలలో అత్యుత్తమ ఫలితాలు సాధించాలన్నారు" .ఆఖరి సంవత్సర బి.ఏ. విద్యార్థిని ఫలక్ కార్యక్రమానికి యాంకరింగ్ చేయగా మేఘన, శ్రీయ కుమారి,




మీనాక్షి, తదితరులు తమ నృత్యాలతో వచ్చిన విద్యార్థులను అలరించారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డా. ప్రమోద్ కుమార్, జి. చంద్రయ్య, డా. వరప్రసాద్, ఎం.ఎ. రహీమ్, శ్రీమతి సంగీత రాణి, డాక్టర్ వాసవి, కుమారి నీర్జ, మల్లికార్జున, జమున విద్యార్థులు పాల్గొన్నారు.

# నిరుపేద కుటుంబానికి లాయర్ల చేయూత

**-న్యాయవాదులకు కృతజ్ఞతలు తెలిపిన కుటుంబం**

**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఏప్రిల్ 29 :** చిన్న తనంలోనే కంటిచూపు మందగించి ఆర్థిక స్తోమత లేక ఇబ్బందులు పడు తున్న బాలికకు యువలాయర్లు అండగా నిలిచి భరోసా కల్పించిన సంఘటన మద్దునూర్‌లో జరిగింది. చిన్నతనంలో తండ్రి రవిని కూడా కోల్పోగా ఆ కుంటుంబం పరిస్థితి దయనియంగా మారింది.



జగిత్యాల జిల్లాబుగ్గారం మండలం మద్దునూరు గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన గజ్జెల గంగజల (18) చిన్నతనం నుండే షుగర్ వ్యాధి ఉండడం మూలంగా కంటి చూపును కూడా కోల్పోయింది. అయితే ఆ కుటుంబాన్ని పేదరికం వెంటాడుతోంది. పెద్ద ఆసుపత్రులకు వెళ్లి వైద్యం చేయిస్తే కంటి చూపు వచ్చే అవకాశం ఉందని డాక్టర్లు చెప్పినప్పటికి డబ్బులు లేక ఇంట్లోనే ఉండాల్సిన పరిస్థితి.నేల కోనడం కూతురు పరిస్థితి చూసి తల్లి భాధపడడం తప్పా చేసేదేమి లేకుండ పోతోంది.దీంతో వీరు ఇంటి వద్దనే ఉంటోంది.ఆపరేషన్ చెయించే ఆర్థిక స్తోమత వారికి లేకపోవడంతో ఇంటి వద్దే ఉంటున్న ఆమే పరిస్థితిని తెలుసు కున్న మద్దునూర్ కు చెందిన యువ న్యాయవాది గజ్జెలరాజు ఇట్టి విషయాన్ని జగిత్యాల బార్ అసోసియే షన్, తన తోటి అడ్వకేట్స్ దృష్టికీ తీసుకెళ్లడంతో వెంటనే వారు స్పందించి గంగ జల కు కొంత ఆర్థిక సహాయం అందించారు. ఆపదలో ఉన్న పేదవారికి ఎంతో కొంత తోచిన విధంగా సహాయం చేయడం సామాజిక భాద్యతని న్యాయవాదులు తెలిపారు. తమ కూతురు వైద్యం కోరకు ఆర్థిక సహాయం చేసిన న్యాయవాదులకు గంగాజలా తల్లి సుశీల కృతజ్ఞతలు తెలిపింది.

# నాణ్యత ప్రమాణాలకు లోబడి ధాన్యం కొనుగోళ్లు చేయాలి

**-జగిత్యాల జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్**

**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఏప్రిల్ 29 :** నాణ్యత ప్రమాణాలకు లోబడి ధాన్యం కొనుగోళ్లు చేయాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ అధికారులకు సూచించారు. మంగళవారం పెగడపల్లి మండల కేంద్రంలోని పిఎసిఎస్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ తనిఖీ చేశారు. ఈ



సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో ఏలాంటి అవకతవకలు జరగకుండా చూడాలని, సీరియల్ రిజిస్టర్ ప్రకారం ధాన్యం మ్యాచింగ్ చేయాలని, నాణ్యత ప్రమాణాలకు లోబడి ధాన్యం కొనుగోళు చేయాలని ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని 24 గంటల లోపు రైస్మిల్లులకు తరలించాలని, ట్యాబ్ డేటా ఏంట్రీ నమోదు, లారీ లోడు ఎప్పటికప్పుడు తప్పనిసరిగా డాటాఏంట్రీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డివో మధుసూదన్, తహసీల్దార్ రవీందర్, ఎంపిడివో. అధికారులు పాల్గొన్నారు.

## భూభారతితో భూసమస్యల పరిష్కారం

**-జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**




**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఏప్రిల్ 29 :** భూభారతితో రైతుల భూసమస్యలకు పరిష్కారం లభిస్తుందని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ అన్నారు. మంగళవారం పెగడపల్లి మండల కేంద్రంలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన భూభారతి కొత్త ఆర్ఆర్ చట్టం అవగాహన సదస్సులో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల భూసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నూతన ఆర్ఓఆర్ చట్టం భూభారతిని అమలు చేసిందని, భూభారతితో రైతులకు మేలు జరుగుతుందన్నారు. ప్రతి గామానికి ఓ జిపివోను నియమించడానికి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డివో మధుసూదన్, తహసీల్దార్ రవీందర్, ఎంపిడివో, ఏఎంసి చైర్మన్, రైతులు పాల్గొన్నారు.

## చెట్టుపై నుండి పడి వ్యక్తి మృతి

**చురకలు విలేకరి, జగిత్యాల, ఏప్రిల్ 29 :** మామిడికాయలు తెంపడానికి వెళ్లిన సీతారాం సాయక్కర్(57) అనే వ్యక్తి చెట్టు కొమ్మ విరిగి పడటంతో కింద పడి మృతి చెందినట్లు జగిత్యాల రూరల్ పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మధ్యప్రదేశ్ రాష్ట్రం బృహుపూర్ జిల్లా నవారా గ్రామానికి చెందిన సీతారాం సాయక్కర్ అనే వ్యక్తి జీవనోపాధి నిమిత్తం జగిత్యాలకు వచ్చాడని, మంగళవారం అంతర్గాం గ్రామ శివారులోని ఓ మామిడితోటలో మామిడికాయలు తెంపడానికి చెట్టుపై ఎక్కగా, చెట్టు కొమ్మ విరిగి సీతారాం సాయక్కర్ కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. సీతారాం సాయక్కర్ను చికిత్స నిమిత్తం జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, మార్గమధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. మృతుని బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలను ఖండిస్తున్నాం



**చురకలు విలేకరి, మెట్ పల్లి, ఏప్రిల్ 29 :** సీఎం రేవంత్ రెడ్డిపై ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలను ఖండిస్తున్నామని కోరుట్ల నియోజకవర్గ మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు అందె భవితరాణి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గత పదేళ్లలో బిఆర్ఎస్ పార్టీ చేసిన అవినీతిని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని. సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్రంలో అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందిస్తున్నారన్నారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సీఎం రేవంత్ రెడ్డిపై అసత్యప్రచారం చేస్తే ఊరుకునేది లేదని, తీన్మార్ మల్లన్న బిఆర్ఎస్ కు తొత్తుగా మారారని, తన వైఖరి మార్చుకోకపోతే మహిళ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడుతామన్నారు.

## విద్యార్థికి సన్మానం



**చురకలు విలేకరి, కోరుట్ల, ఏప్రిల్ 29 :** ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి కోరుట్ల పట్టణంలోని గంగంపేట్ కి చెందిన అబ్దుల్ రాయన్ 1000 మార్కులకు గాను 994 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో విశిష్ట ర్యాంకును సంపాదించి, ఈ అసాధారణ విజయాన్ని పురస్కరించుకొని అబ్దుల్ రాయన్‌ను అల్-ఉమర్-వెల్ఫేర్ సొసైటీ సభ్యులు పుష్పగుచ్ఛం ఇచ్చి సన్మానించారు.ఈ అభినందన కార్యక్రమంలో విద్యార్థి తండ్రి అబ్దుల్ మొబిన్, అల్-ఉమర్-వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు ఎండి జకీర్ మౌలానా,వైస్ ప్రెసిడెంట్ ఎండి వాజిద్, వైస్ ప్రెసిడెంట్ ఎండి ఇర్ఫాన్, క్యాషర్ ఎండి మోసిన్,జనరల్ సెక్రెటరీ ఎండి అలీముద్దీన్,ఎండి మాజిద్,ఎండి షకీల్,ఎండి వసీమ్ అక్రమ్ పాల్గొన్నారు.

# లో వోల్టేజ్ సమస్య పూర్తిస్థాయిలో తొలగిస్తాం

**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ ఏప్రిల్ 29 :** రామగిరి మండలంలోని ప్రతి గ్రామంలో లో వోల్టేజ్ సమస్యను పూర్తిస్థాయిలో తీరుస్తామని ఏఈ మహేందర్ రెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం రామగిరి మండలం కల్వచర్లలో నూతన ట్రాన్స్ఫార్మ్ (డి టి ఆర్) ప్రారంభించారు. కల్వచర్ల గ్రామంలోనీ రెండ్ల వాడ, శివాలయం విధికి తరచూ కరెంట్ ఓవర్ లోడ్ సమస్య ఉందని గ్రామస్థులు తాజా మాజీ సర్పంచ్ గంట పద్మ వెంకట రమణ రెడ్డి దృష్టికి తీసుకు వచ్చిన వెంటనే రాష్ట్ర మంత్రివర్యులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు కి సమస్యను వివరించగా వెంటనే స్పందించి విద్యుత్ అధికారుల తో మాటలాడి గ్రామంలో ఓవర్ లోడ్ సమస్య ఉన్న ప్రతిచోట సర్వే చేసి



నూతన ట్రాన్స్ఫార్మ్ (డి టి ఆర్) ఏర్పాటు చేయాలని డిఈ కి ఆదేశాలు ఇవ్వగా ఎడి ,ఏఈ,లైన్ మెన్ గ్రామం లో పర్యటించి మూడు చోట్ల అవసరం ఉన్నదని నిర్ణయించి మూడు డిటిఆర్ ట్రాన్స్ఫర్లను సాంక్షన్ చేయడం జరిగింది. అందులో భాగంగా మొదటి డిటిఆర్‌ను రెండ్లవాడ, శివాలయం వీధిలో అమర్చడం జరిగింది. దానిని ఏ ఈ మహేందర్ రెడ్డి,గ్రామ మహిళలు మరియు గ్రామ ప్రజలు,నాయకులు కొబ్బరి కాయలు కొట్టి ప్రారంభించడం జరిగింది. ఇక రెండు కూడా త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. ఓవర్ లోడ్ సమస్యను తెలిపిన వెంటనే పరిష్కరించిన రాష్ట్ర మంత్రివర్యులు శ్రీధర్ బాబు కి, డిఇ, ఏఈ, ఎడి, లైన్ మెన్, తాజా మాజీ సర్పంచ్ గంట పద్మ రమణ రెడ్డి కి గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గంట వెంకటరమణ రెడ్డి,మాజీ ఎంపీటీసీ కొట్టే సందీప్,మాజీ ఉప సర్పంచ్ వేము కనకయ్య,ముచకుర్తి శ్రీనివాస్, బిరుదు లక్ష్మణ్,అర్రెల్లి కొమ్ము్రయ్య, ఐ ఎన్ టి యు సి వైస్ ప్రెసిడెంట్ కోట రవీందర్ రెడ్డి,రెండ్ల రజిత,రాపెల్లి కోమలత, రెండ్ల రమేష్,రాపెల్లి బాబు, చొప్పరి రాజయ్య, కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ కొలిపాక సారయ్య మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు మేకల మారుతి, మల్లేష్ గౌడ్,రాజు ,రాజేందర్,సంపత్, లక్ష్మినారాయణ,కుమార్,నాగరాజు , పడాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# జస్ట్ ట్రాన్సిషన్ పై వర్క్ షాప్

**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ ఏప్రిల్ 29 :**

జస్ట్ ట్రాన్సిషన్‌పై కమ్యూనిటీ వర్క్‌షాప్ జేఎన్‌టీయూ మంథని,పెద్దపల్లిలో నిర్వహించబడింది. బొగ్గు రంగంలో లోతైన వేరులు గల పెద్దపల్లి ప్రాంతీయ సమాజాలు తరతరాలుగా తమ కష్టపడి చేసిన శ్రమతో ఈ ప్రాంత ఆర్థిక వ్యవస్థకు బలాన్ని చేకూర్చాయి. ప్రపంచం క్లీన్ ఎనర్జీ మరియు నూతన పరిశ్రమల వైపు మారుతున్న సందర్భంలో, బొగ్గుపై ఆధారపడిన కుటుంబాలు వెనుక పడిపోకుండా చూసుకోవడం అత్యంత అవసరం. ఈ దిశగా, జస్ట్ ట్రాన్సిషన్‌లి



పై కమ్యూనిటీ వర్క్‌షాప్ ఇటీవల జేఎన్‌టీయూ మంథనిలో నిర్వహించ బడింది. ఢిల్లీకి చెందిన ప్రజా విధాన సంస్థ స్వనితి ఇనిషియేటివ్ మరియు కామన్స్ కలెక్టివ్ సంయుక్తంగా ఈ వర్క్‌షాప్‌ను నిర్వహించాయి. ఈ కార్యక్రమం బొగ్గు తర్వాత జీవనోపాధి అవకాశాలపై స్థానిక సమాజాలను చర్చలో భాగస్వామ్యం చేయడమే లక్ష్యంగా సాగింది. స్వనితి ఇనిషియేటివ్‌కు చెందిన శ్రీరామ్ కోలసాని మరియు సాయిచంద్ర ఆర్థిక వైవిధ్యీకరణ మరియు స్థిరమైన జీవనోపాధి అవకాశాలపై చేసిన అధ్యయనానికి సంబంధించిన ముఖ్య అంశాలను ప్రజలతో పంచుకున్నారు. కామన్స్ కలెక్టివ్ నుండి రాజశేఖర్ మరియు అభినవ చురుకైన మద్దతుతో, జేఎన్‌టీయూహెచ్ మంథని ప్రిన్సిపాల్ డా. విష్ణు వర్ధన్ అద్భుతంగా ఈ కార్యక్రమానికి నాయకత్వం వహించారు. ఈ వర్క్‌షాప్ ద్వారా గ్రామ సర్పంచ్‌లు, స్థానిక నాయకులు మరియు సమాజ సభ్యులు పాల్గొని సవాళ్లు, అవకాశాలు మరియు నూతన నైపుణ్యాల అవసరాల పై ఆలోచనలు పంచుకున్నారు. ఈ చర్చలు ఒక న్యాయమైన మరియు సమగ్ర భవిష్యత్తును రూపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. మార్పును ఎదుర్కొంటున్న బొగ్గుపై ఆధారపడిన సమాజాలను శక్తివంతం చేయడానికి ఇది ఒక ముఖ్యమైన ముందడుగు.

# అపోహాలు వీడండి.. నేత్రదానం చేయండి

**- నేత్రదాత సంపత్ కుటుంబం ఆదర్శం**
**- నేత్రదాత కుటుంబానికి అభినందన పత్రం**
**- అవగాహన కల్పించిన మాజీ జెడ్పీటీసీ వెంకటరమణ రెడ్డి**

**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ ఏప్రిల్ 29 :** పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం బేగంపేట గ్రామానికి చెందిన చిప్ప సంపత్, ఇటీవల గుండె పోటు తో మృతిచెందగా, ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు ఎల్ వి ప్రసాద్ ఐ బ్యాంకుకు, సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దానం చేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని గ్రామంలో మంగళవారం నేత్రదాత సంపత్ సంస్మరణ సభను నిర్వహించారు. ఉపాధి కోసం కుటుంబంతో




హైదరాబాద్ కు వెళ్లిన సంపత్ గుండె పోటుతో మృతి చెందడం బాధాకరమని, ఇంటి పెద్ద దిక్కును కోల్పోయిన విషాదంలో కూడా భార్య సంధ్య, కూతురు లక్ష్మీ ప్రసన్న, సోదరి రాజమణి, బావ కనకరాజు స్పందించి మరో ఇద్దరు అందులకు చూపులు ప్రసాదించడానికి, సంపత్ నేత్రాలను దానం చేయడం అభినందనీయమని కల్వచర్ల కు చెందిన మాజీ జెడ్పీటీసీ వెంకటరమణ రెడ్డి, సదాశయ ఫౌండేషన్ ముఖ్య సలహాదారులు నూక రమేష్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి కే.ఎస్.వాసు కొనియాడారు. నేత్రదానంపై అపోహలు, అనుమానాలు వీడి ప్రతి ఒక్కరు మరణానంతరం నిద్రదానం చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం సదాశయ ఫౌండేషన్, రామగుండం లయన్స్ క్లబ్ సంయుక్తంగా అందించిన అభినందన పత్రాన్ని అతిథుల చేతుల మీదుగా నేత్రదాత కుటుంబానికి అందజేసి వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో పలు సంఘాల బాధ్యులు మాటేటి శ్రీనివాస్, సత్తన్న, బంధువులు సారయ్య, సందెల కుమార్ కొత్తూరు మోహన్ వెంకటరమణ దంపతులు పాల్గొన్నారు. సందెల కుమార్, ఊదరి కుమార్ , తీగల రాజమల్లు, బొజ్జ రామ్మూర్తి, శ్రీధర్ల రమేష్, శ్రీరాముల కుమార్ ,బుర్ర సతీష్,బొజ్జ శ్రీనివాస్ గంధం రమేష్, బాణాల సత్యనారాయణ, మాదాసి శ్రీనివాస్, బొంతల రవి, చొప్పరి సంజీవ్, బొంతల సదానందం, కెక్కర్ల శ్రీనివాస్, నాగవెల్లి శ్రావణ్, సుద్దాల కిరణ్ , మాదాసి శ్రావణ్,కందుకూరి శ్యామ్ రంగం దశరథం , డాక్టర్ సురేష్, కెక్కర్ల రత్నాకర్, కెక్కర్ల రమణ, పాలపండ్ల రమేష్, ఏట రమేష్, సందెల శ్రీనివాస్, కట్కూరి కుమార్, జంగపెల్లి శ్రీనివాస్, రేగళ్ళ లక్ష్మణ్, వేముల కర్ణాకర్, ఆడెపు మొగిలి , సుద్దాల సంపత్ , రేణికుంట్ల సురేష్ , చిప్ప జంపన్న చిప్ప సంపత్ కుటుంబ సభ్యులు వారి బంధువులు తదితరులు పాల్గొన్నారు.

## అర్హత లేకుండా వైద్యం చేస్తే కఠిన చర్యలు



**చురకలు ప్రతినిధి, మెట్ పల్లి, ఏప్రిల్ 29 :** అర్హత లేకుండా వైద్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె ప్రమోద్ కుమార్ హెచ్చరించారు. మెట్ పల్లి పట్టణంలోని జ్యోతి క్లినిక్ ను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎలాంటి అనుమతులు, అర్హత కలిగిన వైద్యులు లేకుండా రోగులకు చికిత్సలు చేస్తున్నారని ఫిర్యాదు రాగా ఈ క్లినిక్ ను వైద్య ఆరోగ్యశాఖ అధికారులు మూసివేయించారు. క్లినిక్ నడుపుతున్న వారిని పోలీసులకు అప్పగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రులు ప్రభుత్వ గుర్తింపు లేకుండా, అర్హత కలిగిన డాక్టర్లు లేకుండా చికిత్సలు అందిస్తున్న వాటిపై కఠిన చర్యలు తీసుకోబడతాయన్నారు. ఈ తనిఖీలలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డా. ఆకుల శ్రీనివాస్, మండల వైద్యాధికారి డాక్టర్ ఎల్లాల అంజిత్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## దుబాయి మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం



**చురకలు విలేకరి, ధర్మపురి, ఏప్రిల్ 29 :** ఇటీవలే దుబాయి దేశంలో హత్యకు గురై మృతిచెందిన ధర్మపురి మండలంలోని దమ్మన్నపేటకు స్వర్గం శ్రీనివాస్ కుటుంబానికి ధర్మపురి హిందూ ఐక్యవేదిక సభ్యులు అండగా నిలిచారు. స్వర్గం శ్రీనివాస్ కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగా లేనందున హిందూ ఐక్య వేదిక సభ్యులు ఆర్థిక సహాయం చేశారు. మంగళవారం మృతుడు శ్రీనివాస్ తల్లికి ధర్మపురి హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో దాతల సహాయంతో 57వేల రూపాయలు జమ చేసి ఫిక్సడ్ డిపాజిట్ చేసి అందించారు. ఆర్థిక సాయానికి సహాయ సహకారాలు అందించిన వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దమ్మన్నపేట, ధర్మపురి హిందూ ఐక్యవేదిక సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నాపై దాడి ఒక పెద్ద రాజకీయ కుట్ర

**-మాజీ కౌన్సిలర్ ఇందూరి సత్యం**



**చురకలు ప్రతినిధి,కోరుట్ల ఏప్రిల్ 29 :** నేను కోరుట్ల పట్టణ బిజెపి సీనియర్ నాయకుని కోరుట్ల మాజీ మున్సిపాల్ కౌన్సిలర్ ఈనెల 16 తేదీన స్థానిక మున్సిపాల్ కార్యాలయంలో నన్ను చంపుటకు పెద్ద కుట్ర జరిగినది. ఈ కుట్ర వెనుక రాజకీయంగా దెబ్బతీయడానికి పన్నిన పన్నగం. గొడికే వినోద్ అను వ్యక్తి సాఫ్ట్వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఇతని వెనుక ఉండి నన్ను చంపడానికి ఒక కుట్ర పన్ని ఏడుగురు కలిసి నన్ను హత్యాయత్నం చేసినారు. ఈ ఏడుగురిపై మంగళవారం రాత్రి ఎఫ్ ఐ ఆర్ నెంబర్ 149/2025 కేసు నమోదు అయినది. వారిని స్థానిక తహసిల్దార్ కార్యాలయం నందు బైండోవర్ చేసినారు. గొడికే వినోద్ కు నాకు ఎలాంటి భూ లావాదేవీలు లేవు కానీ ఈ దాడి వెనుక ఒక వ్యక్తి ఉండి నడిపించినట్లుగా అనిపిస్తున్నది. ఆ వ్యక్తి త్వరలో బయటపడుతాడు అతనిపై కూడా చట్ట ప్రకారం ఎదుర్కొంటాను అని ఉన్నత న్యాయస్థానానికి వెళ్ళుతానని పత్రిక ప్రకటనలో ఇందూరి సత్యం తెలిపారు.

# ముస్లిం విద్యార్థులపై సవతి తల్లి ప్రేమ తగదు

**-మతతత్వ ధోరణులు కలిగిన ప్రొఫెసర్లు, లెక్చరర్ల తీరుతో ప్రయివేటు కళాశాలలకు చెడ్డపేరు**

**-ఇలాంటి వారిని గుర్తించి ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు తక్షణమే తొలగించాలి**

**-ఎంఐఎం పార్టీ కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ విజ్ఞప్తి**



**కరీంనగర్, ఏప్రిల్ 29 :** ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో ముస్లిం విద్యార్థులపై సవతి తల్లి ప్రేమ తగదని ఓ వర్గాన్ని కించపరిచే విధంగా మాట్లాడడం విద్యాసంస్థల్లో పనిచేస్తున్న అధ్యాపక వర్గానికి విద్యా వ్యవస్థకే కలంకమని తద్వారా ఆయా ఇంజనీరింగ్ ఫార్మా ఎంబీఏ ఎంసీఏ ఉన్నత విద్య కు సంబంధించిన కళాశాలలకు చెడ్డ పేరు వచ్చే ప్రమాదం ఉందని ఎంఐఎం పార్టీ కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ అన్నారు. తిమ్మాపూర్ మండల కేంద్రంలోని ఒక ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాలలో మెయింటర్ అయిన ఒక మహిళా ప్రొఫెసర్,ముస్లిం విద్యార్థులను జాతి పేరుతో కించపరచడం, దాయాది దేశమైన పాకిస్తాన్తో విద్యార్థులను పోల్చడం, మీ జాతితో దేశానికి ప్రమాదం ఉందని చెప్పడం జరిగిందని వెంటనే అదే రోజు సదరు ఇంజనీరింగ్ కళాశాలలో చదివే విద్యార్థులు తన దృష్టికి తీసుకురావడం జరిగిందని తక్షణమే తాను పోలీసుల దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లడం జరిగిందన్నారు. మంగళవారం కళాశాలకు వెళ్లి సదరు కళాశాల ప్రిన్సిపాల్ తో మాట్లాడడం జరిగిందని, సదరు మహిళా ప్రొఫెసర్, విద్యార్థులకు జరిగిన అంశంపై విచారం వ్యక్తం చేసి, క్షమాపణలు కోరినట్లు ప్రిన్సిపాల్ తమకు చెప్పారని, ఈఅంశాన్ని సద్దుమణిగేలా చొరవ తీసుకున్నట్లు, భవిష్యత్తులో పునరావృతం కాకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని ప్రిన్సిపల్ హామీ ఇచ్చారని చెప్పారు.మతతత్వ ధోరణులను కలిగిన ప్రొఫెసర్లు, లెక్చరర్లు, టీచర్లు, ఆయా ప్రైవేటు విద్యాసంస్థల్లో ఉన్నట్లయితే తక్షణమే వారిని గుర్తించి సదరు విద్యాసంస్థల యాజమాన్యాలు తక్షణమే తొలగించా లని, వీరి తీరుతెన్నులతో, మీవిద్యా సంస్థలకు అడ్మిషన్ల పరంగా తీవ్ర నష్టం వాటిల్లడంతో పాటు చెడ్డ పేరు వస్తుంద న్నారు.గంగా జమున తెహజీబ్ కు ప్రతిరూపమైన కరీంనగర్ జిల్లాలో ముఖ్యంగా విద్యాసంస్థల్లో ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోవడం సంభ్రమాశ్చర్యానికి గురిచేసిందన్నారు. భవిష్యత్తులో ఇలాంటి అంశాలు పునరావృతం కాకుండా జిల్లాలోని అన్ని విద్యాసంస్థల యాజమాన్యాలు చర్యలు చేపట్టాలని గులాం అహ్మద్ విజ్ఞప్తి చేశారు. తామిచ్చిన సమాచారం మేరకు తక్షణమే స్పందించిన పోలీసు శాఖ అధికారులకు గులాం అహ్మద్ కృతజ్ఞతలు తెలిపారు.

## మహిళా కార్మికుల సమస్యలపై పోరాడుతాం

**-ఐఎన్‌టియుసిఆర్‌జి త్రీ ఉపాధ్యక్షుడు కోట రవీందర్ రెడ్డి**



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ ఏప్రిల్ 29 :** సింగరేణి సంస్థలో పనిచేసే మహిళా కార్మికుల కోసం ఐఎన్టియుసి మాత్రమే పోరాటం చేస్తుందని ఆర్జీ 3 ఏరియా ఉపాధ్యక్షుడు కోట రవీందర్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆర్ జి త్రీ పరిధిలోని ఓసిపి ఒకటి లో మహిళా కార్మికులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మహిళా కార్మికుల సమస్యలు ఏదైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని దాన్ని మేనేజ్మెంట్ చూసి తీసుకెళ్లి పరిష్కరిస్తామని అన్నారు. మహిళా కార్మికుల విధివిధానాలపై అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర కమిటీ నాయకులు గడ్డం తిరుపతి యాదవ్, బ్రాంచ్ సలహాదారులు జక్కుల దామోదర్ రావు ,బ్రాంచ్ కార్యదర్శి ఎన్ శ్రీనివాసరావు , ఫిట్ సెక్రటరీలు వెంకటస్వామి కిషన్ నాయక్ ఎనగందుల సదానందం తో పాటు మహిళా కార్మికులు పాల్గొన్నారు.

# ఇంధన వనరులు భవిష్యత్ తరాలకు అవసరం

**-కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ**



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ ఏప్రిల్ 29 :** ఇంధన వనరులు భవిష్యత్ తరాలకు అవసరం అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. విశాకా ఇండస్ట్రీస్ యొక్క ఆటమ్ సోలార్ రూఫ్ – ఆటమ్ చార్జింగ్ స్టేషన్లు మరియు ఆటమ్ ఈ-బైక్ రాహుల్ గాంధీ ప్రారంభించారు. పునరుత్పాదక ఇంధన రంగాన్ని పురోగమింపజేసే దిశగా,రాహుల్ గాంధీ గారు రాయ్‌బరేలీలో విశాకా ఇండస్ట్రీస్ రూపొందించిన ఆటమ్ సోలార్ రూఫ్ను అధికారికంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమం భారతదేశంలో పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని మరియు గ్రీన్ మోబిలిటీ పరిష్కారాలను వేగవంతం చేసే దిశగా ఒక కీలక ముందడుగు.ఈ ప్రారంభ వేడుకలో, ఆటమ్ చార్జింగ్ స్టేషన్లు మరియు ఆటమ్ ఈ-బైక్లను కూడా ప్రారంభించారు. ఈ పరిష్కారాలు విశాకా ఇండస్ట్రీస్ యొక్క పర్యావరణ అనుకూలమైన, ఆవిష్కరణాత్మక దృష్టిని ప్రతిబింబిస్తున్నాయి.ఈ కార్యక్రమానికి హాజరై డా. వివేక్ చెన్నూర్ ఎమ్మెల్యే శ్రీమతి సరోజ గడ్డం, కారెస్పాండెంట్, డా. బి.ఆర్. అంబేడ్కర్ విద్యాసంస్థలు వంశీ గడ్డం , పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు మరియు విశాకా ఇండస్ట్రీస్ డైరెక్టర్ లు హాజరయ్యారు.ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ, పునరుత్పాదక ఇంధన వనరులు భవిష్యత్తు తరాల కోసం ఎంతో అవసరమని పేర్కొన్నారు.భారత్‌ను గ్రీన్ ఎనర్జీ మార్గంలో ముందుకు తీసుకెళ్లడంలో ఆటమ్ ప్రాజెక్టులు కీలక పాత్ర పోషిస్తున్నాయని ఆయన ప్రశంసించారు.ఆటమ్ సోలార్ రూఫ్ ప్రత్యేకత ఏమిటంటే ం ఇది ఒకే సారి నాణ్యమైన రూఫింగ్ మెటీరియల్‌తో పాటు సౌరశక్తిని అందించే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. ఆటమ్ చార్జింగ్ స్టేషన్లు వీటి ఆధారంగా స్వయం సమృద్ధి సాధించగలిగే పునరుత్పాదక విద్యుత్తును వినియోగదారులకు అందిస్తాయి, దీనివల్ల విద్యుత్తు పై ఆధారపడకుండా, స్వచ్ఛమైన శక్తిని అందించవచ్చు అని పేర్కొన్నారు.విశాకా ఇండస్ట్రీస్ తన ఆటమ్ శ్రేణి ఉత్పత్తుల ద్వారా పర్యావరణానికి మిత్రమైన పరిష్కారాలను సాధారణ జీవితంలోకి తీసుకొచ్చేందుకు కట్టుబడి ఉందన్నారు.



**విశాకా ఇండస్ట్రీస్ గురించి**

విశాకా ఇండస్ట్రీస్ భారతదేశంలో అగ్రగామి నిర్మాణ ఉత్పత్తుల సంస్థగా పేరు గడించింది.నూతన ఆవిష్కరణలు, నాణ్యతా ప్రమాణాలు, పర్యావరణ పరిరక్షణను సంస్థ ప్రధాన లక్ష్యాలుగా పెట్టుకుని ముందుకు సాగుతోంది. ఆటమ్ విభాగం ద్వారా సంస్థ సౌర శక్తి మరియు ఎలక్ట్రిక్ మొబిలిటీ రంగాలలో ప్రాధాన్యత కలిగిన పరిష్కారాలను అందిస్తోంది అని పేర్కొన్నారు.

# సీఎంఆర్ఎఫ్, కళ్యాణ లక్ష్మి చెక్కులు అందజేత

**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ ఏప్రిల్ 29 :**

మంథని నియోజకవర్గం లోని కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ సిఎంఆర్ఎఫ్ చెక్కులను రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు ఆయన వ్యక్తిగత సహాయకులు ఆకుల చంద్ర శేఖర్ లబ్ధిదారులకు నేరుగా ఇంటికి వెళ్లి మంగళవారం అందజేశారు. ఇందులో 676 సీఎంఆర్ఎఫ్,21 కళ్యాణ లక్ష్మి చెక్కులకు గాను 2 కోట్ల 75 లక్షల 10 వేల విలువైన చెక్కులు మంజూరు మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు మంజూరి చేయించారు.మంథని నియోజకవర్గం - పెద్దపల్లి మరియు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలలో 676 సీఎంఆర్ఎఫ్ మరియు 21 కళ్యాణ లక్ష్మి చెక్కులను గత వారం రోజులు ప్రతి గ్రామంలో ఇంటి వద్దకు వెళ్లి మరియు క్యాంపు కార్యాలయంలో మంత్రిగారి ఆదేశాల మేరకు లబ్ధిదారులకు నేరుగా చెక్కులు అందజేయడం జరిగింది.ఇందులో మంథని మండలం/టౌన్ (136 చెక్కులు) - 40,96,500/- ముత్తారం మండలం (85 చెక్కులు) - 31,99,500/- రామగిరి మండలం (96 చెక్కులు) - 34,58,000/- కమాన్ పూర్ మండలం (56 చెక్కులు)- 20,23,500/- పాలకుర్తి మండలం (20 చెక్కులు) - 8,34,000/- కాటారం మండలం (66 చెక్కులు) - 25,08,500/- మహ ముత్తారం మండలం (32 చెక్కులు)- 11,80,500/- మహదేవ్ పూర్ మండలం (50 చెక్కులు)- 18,74,000/-మలహార్ రావు మండలం (70 చెక్కులు)- 29,78,000/-పలిమెల మండలం (7 చెక్కులు) - 2,21,500/- మరియు ఇతర మండలాలు (120 చెక్కులు) - 30,85,500/-కళ్యాణ లక్ష్మి రామగిరి 4, ముత్తారం 4, కమాన్ పూర్ 7, మంథని 6 మంథని నియోజకవర్గం లోని పలు ఆస్పత్రిలలో అనారోగ్యంతో చికిత్స పొంది సహాయం కొరకు మంత్రి క్యాంప్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్న వారికి ఐటీ మరియు పరిశ్రమల శాఖ మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు వీరికి ప్రభుత్వం నుండి సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంజూరు చేపించారు.మంగళవారం మంథని రామగిరి ముత్తారం మండలం లోని పలు గ్రామాల్లో సీఎంఆర్ఎఫ్, కళ్యాణ లక్ష్మి చెక్కులను వారి గ్రామం వారి వద్దకే వచ్చి గౌరవ మంత్రి ఆదేశాల మేరకు వారి వ్యక్తిగత ప్రభుత్వ సహాయకులు ఆకుల చంద్ర శేఖర్ నేరుగా లబ్ధిదారులకు చెక్కులు అందజేయడం జరిగింది.

# పొడి వనరుల సేకరణ కేంద్రం సందర్శన

**చురకలు ప్రతినిధి, మెట్ పల్లి, ఏప్రిల్ 29 :**


మెట్ పల్లి పట్టణంలోని పొడి వనరుల సేకరణ కేంద్రాన్ని మంగళవారం మున్సిపల్ కమిషనర్ టి.మోహన్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలోని ఇళ్లలో నుంచి వెలువడే పొడి చెత్తను ప్రతి ఒక్క ఆటో డ్రైవర్లు ప్రతిరోజు పొడి చెత్తను పొడి వనరుల సేకరణ కేంద్రాన్ని తరలించాలని ఆదేశించారు. సిబ్బంది నిర్లక్ష్యం వహించి పొడి చెత్తను బయట ఎక్కడ అమ్మిన కఠిన చర్యలు తప్పవన్నారు.



పట్టణ ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తడి చెత్త పొడి చెత్త వేరు చేసి మున్సిపల్ వాహనాలకు అందివ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో డిఈ నాగేశ్వరరావు, ఇన్చార్జ్ సానిటరీ ఇన్స్పెక్టర్ రత్నాకర్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ విష్ణు, ముజీబ్, నరేష్ పాల్గొన్నారు.

# హుజురాబాద్ గులాబీ శ్రేణుల్లో "ఎల్కతుర్తి సభ" జోష్

**-హుజురాబాద్ నియోజకవర్గంలో.. "కౌశిక్" నామ స్మరణ**
**-కౌశిక్ జోరు.. గులాబీ హెూరు**
**-అదరడు ... బెదరడు .. కౌశిక్..**
**-దూకుడే కౌశిక్ నైజం**
**-నియోజకవర్గంపై పట్టు బిగించిన యువ ఎమ్మెల్యే కౌశిక్**



**చురకలు విలేఖరి హుజురాబాద్ ఏప్రిల్ 29 :** హుజురాబాద్ నియోజక వర్గంలో.. "కౌశిక్" నామ స్మరణ.కౌశిక్ జోరు.. గులాబీ హెూరు.హుజురాబాద్ గులాబీ శ్రేణుల్లో "ఎల్కతుర్తి సభ" జోష్ సంచలనాలకు మారుపేరు హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి. అతని పనితీరు, ప్రవర్తన హీరోను తలపిస్తుంది. అయన లైఫ్ స్టయిల్ సినిమాలో కథానాయకుని పాత్రలా ఉంటుంది. యూత్ లో, పార్టీ శ్రేణుల్లో ఆయనకు ఉన్న క్రేజీ అంతా ఇంతా కాదు.. పార్టీశ్రేణుల్లో ఉత్సాహం నింపుతారు. అయన కనిపిస్తేనే కార్యకర్తల్లో జోష్ వస్తుంది. నినాదాలతో దద్దరిల్లిపోతుంది. తనవద్దకు వచ్చే యూత్ భుజాలపై చేయి వేసి పలకరిస్తారు.. పెద్దవాళ్ళు వస్తే.. రెండు చేతులు జోడించి ఆలింగనం చేసుకుంటారు.. ప్రేమతో మాట్లాడతారు.. సమస్యల పరిష్కారం కోసం తన వద్దకు వచ్చే వారిని ఆదరిస్తారు.అప్పటికప్పుడు అధికారులకు ఫోన్ చేసి.. సీరియస్ గా చెప్పేస్తారు. అభివృద్ధి పై సమీక్ష నిర్వహిస్తారు. సమయాన్ని వృధా చేయకుండా.. ఎప్పుడు ఏదో కార్యక్రమంలో పాల్గొంటూనే ఉంటారు. వివాహాలు, పరామర్శలు, ఇతర కార్యక్రమాలకు వెళ్తారు. అందరిని పేరుపేరునా పలకరిస్తారు. ఆయనకు అన్ని అంశాలపై లోతైన అవగాహన ఉంది. నిర్లక్షాన్ని, అలసత్వాన్ని అస్సలు సహించరు. ఫోన్ లో ఎవరైనా సమస్య చెప్పిన.. సావధానంగా విని.. వెంటనే.. సంబంధిత అధికారులకు ఫోన్ చేస్తారు. తుపానులా ఉంటుంది అయన స్పీడ్. ఎప్పుడు సంచలనాలకు కేంద్ర బిందువుగా ఉంటారు. ఒకవైపు రాష్ట్రస్థాయిలో కేటీఆర్, హరీష్ రావు లను మరిపించే విధంగా ఉంటూనే..మరోవైపు హుజురాబాద్ లోనూ సుడిగాలిగా పర్యటిస్తారు. జనంతో మమేకం అవుతారు.ఏ కార్యక్రమం జరిగినా అయన సెంటర్ ఆఫ్ అట్రాక్షన్ గా నిలుస్తారు.అందరి చూపును ఆకర్షిస్తారు.కాగా కౌశిక్ పూర్తిగా హుజురాబాద్ నియోజకవర్గంపై పట్టు బిగించారు.తనకు ఇక్కడ తిరుగు లేదని తన మార్క్ రాజకీయాలతో, పనితీరుతో చెప్పకనే చెప్తున్నారు.

**మలుపు తిప్పిన బి ఆర్ ఎస్ లో చేరిక**

గతంలో కాంగ్రెస్ పార్టీలోనూ.. దూకుడుతో పనిచేసిన కౌశిక్.. హుజురాబాద్‌లో వచ్చిన ఉప ఎన్నిక సందర్భంగా బి ఆర్ ఎస్ లో చేరారు. అది కౌశిక్ రాజకీయ భవిష్యత్ ను మలుపు తిప్పింది.గులాబీ అధినేత, అప్పటి సిఎం కేసీఆర్ కౌశిక్‌కు ఎమ్మెల్యేల కోటాలోఎమ్మెల్సీగా అవకాశం కల్పించారు. అలాగే మండలి విప్ పదవి కూడా ఇచ్చారు. దీంతో అయన ప్రజలతో మమేకమై పనిచేసారు.2023 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేసి బిజెపి లో చేరిన ఈటల రాజేందర్‌ను ఓడించి అయన వరుస విజయాలకు బ్రేక్ వేశారు.రాష్ట్రంలో బిఆర్ఎస్ అధికారం లోకి వచ్చి ఉంటే.. కౌశిక్ రెడ్డికి మంత్రి పదవి కూడా వచ్చిఉండేదనే అభిప్రాయం పలుచోట్ల వ్యక్తమైంది.

**కౌశిక్ దూకుడు.. సాటెవ్వడు?**

కౌశిక్ రెడ్డి వీణవంక మండల కేంద్రానికి చెందిన వారు. హైదరాబాద్ లో చదువుకున్నారు. రంజీ క్రికెటర్ గా రాణించారు. అయన పర్సనాలిటీ, రూపం ఆయనకు అదనపు ఆకర్షణలు. ఎవరినైనా వెంటనే ఆకట్టుకుంటారు. ఇక ప్రెస్ మీట్లలో తనదైన వాగ్దాటితో మంత్ర ముగ్ధులను చేస్తారు.అనేక వివాదాలు అయన చుట్టూ తిరుగుతుంటాయి.అసెంబ్లీ లోనూ.. ఒకవైపు బాణాల్లాంటి విమర్శలు అధికార పక్షంపై, మంత్రులపై ఎక్కుపెడుతూనే.. మరోవైపు తన సెన్స్ ఆఫ్ హ్యూమర్ తో.. సందర్భోచితంగా ఛలోక్తులు, సెటైర్లు వేయడంలో కౌశిక్ దిట్ట. కౌశిక్ మొదటిసారి అసెంబ్లీలో అడుగు పెట్టినా.. ఆయనలో ఎక్కడా.. అదరడం , బెదరడం ఉండదు. ముక్కుసూటిగా మాట్లాడతారు. హైదరాబాద్ లో బి ఆర్ ఎస్ నుండి కాంగ్రెస్ లో చేరిన ఎమ్మెల్యే గాంధీని దమ్ముంటే.. చర్చకు రావాలని సవాల్ చేయడంతో.. కౌశిక్ ఇంటిపై దాడి చేసే దాకా వెళ్ళింది. అయినా లెక్క చేయలేదు.తన పోరాటం ఆపలేదు. అధికార కాంగ్రెస్ కౌశిక్ పై పలుసార్లు కేసులు కూడా పెట్టింది. నియోజకవర్గ సమస్యలపై ఎప్పుడు తన గళాన్ని వినిపిస్తారు. దళితబంధు, కల్యాణలక్ష్మి, రైతు బంధు తదితర ఎన్నికల హామీలు ఎందుకు అమలు చేయడం లేదంటూ.. ప్రభుత్వాన్ని తరచుగా నిలదీస్తూనే ఉన్నారు. నిత్యం ప్రజాక్షేత్రంలో దూసుకుపోతున్నారు.రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పటికీ.. పార్టీ క్యాడర్ ను అనుక్షణం కాపాడుకుంటూ వస్తున్నారు.తన పట్టును మరింత పెంచుకుంటూ ముందుకు వెళ్తున్నారు. ఆయన స్థానికంగా తిరుగులేని నాయకుడుగా ఎదిగారని, ప్రజల్లో పేరు తెచ్చుకోవడంతో పాటు,పార్టీని బలోపేతం చేసారని,మరో వైపు రాష్ట్ర స్థాయిలో ఫాలోయింగ్ పెంచుకున్నారని, రాష్ట్రంలో అధికారంలోకి బి ఆర్ ఎస్ వస్తే.. అధినేత కేసీఆర్‌కు ఆయనకు మంచి భవిష్యత్తు ఉంటుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

**జనసమీకరణ కోసం శ్రమించిన యువ ఎమ్మెల్యే కౌశిక్**

హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డికి జనంలో విపరీతమైనా క్రేజ్ ఉంది. గతంలో గులాబీ దళపతి కేసీఆర్ ఓ సందర్భంలో వీణవంక లోని అయన గృహంలో బస చేసారు. కేసీఆర్ ఎప్పుడు కౌశిక్ రెడ్డి పేరును సభలో ఉదహరించినా..జనం నుండి కేరింతలు వినిపిస్తాయి.ఒక సందర్భంలో హుజురాబాద్ టైగర్ కౌశిక్ అని అన్నారంటే అర్థం చేసుకోవచ్చు. కేసీఆర్ కౌశిక్ ను బలంగా విశ్వసిస్తున్నారు. కాగా ఏప్రిల్ 27 న ఎల్కతుర్తిలో జరిగిన బి ఆర్ ఎస్ రజతోత్సవ సభకు హుజురాబాద్ నియోజకవర్గం నుండి పెద్ద ఎత్తున జనాన్ని కౌశిక్ తరలించారు. మున్సిపల్ వార్డులు, మండలాల వారిగా కార్యకర్తల సమావేశాలు ఏర్పాటు చేసారు. పెద్ద ఎత్తున జనాన్ని చైతన్యం చేసి సభకు తరలించారు. హుజురాబాద్ పట్టణంలో ప్రధాన రహదారుల వెంట, వాల్ రైటింగ్ తో నింపేశారు. సభ జరిగే రోజు పెద్ద ఎత్తున యువత నియోజకవర్గం నుండి కదిలేలా బైక్ ర్యాలీనిర్వహించారు. కానీ స్వయంగా బుల్లెట్ పై అతిపెద్ద ర్యాలీగా వచ్చారు. గ్రామాల వారిగా జనసమీకరణకు లక్ష్యాలను నిర్దేశించారు. క్రమశిక్షణతో బహిరంగ సమయానికి సభకు చేరుకునేలా ప్రణాళిక చేశారు. ఏదైనా కార్యక్రమం కౌశిక్ చేపడితే.. నిర్వహిస్తే.. పర్ఫెక్ట్ గా ఉంటుందని అందరూ చెప్తుంటారు. హుజురాబాద్ నియోజకవర్గం నుండి సుమారు యాభై వేల మందిని ఉత్సాహంగా ఎల్కతుర్తి రజతోత్సవ సభకు తరలించి పార్టీ శ్రేణుల్లో జనంలో జోష్ నింపారు. ఏది ఏమైనా ఎల్కతుర్తి రజతోత్సవ సభ నేపథ్యంలో.. కౌశిక్ చేసిన హడావిడి.. రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ గా అవుతోంది. వర్తమాన యువ రాజకీయ నేతలకు ఉండాల్సిన లక్షణాలన్నీ కౌశిక్ కు పుష్కలంగా ఉన్నాయి..ఆయన కేసీఆర్ వదిలిన బాణం..ఒక గులాబీ మిసైల్ లాంటి వాడు..అయన ఎదుర్కోవడం.. ఎవరివల్లా కాదు..అయన స్పీడ్ ను తట్టుకోవడం.. ఇతర పార్టీలతో కాదు.. అని సీనియర్ రాజకీయ విశ్లేషకుడు ఒకరు వ్యాఖ్యానించారు.

# పట్టణ పారిశుద్ధ్యంపై అధికారుల ప్రత్యేక శ్రద్ధ వహించాలి

**-జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్**

**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఏప్రిల్ 29 :** పట్టణ పారిశుద్ధ్యంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ అన్నారు. మంగళవారం జగిత్యాల మున్సిపల్ కార్యాలయంలో జగిత్యాల పట్టణ అభివృద్ధి పనులపై ప్రత్యేకాధికారి, జిల్లా అదనపు కలెక్టర్ బిఎస్. లతతో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో పారిశుద్ధ్య, తడి, పొడి చెత్త సేకరణ, ప్లాస్టిక్ నివారణపై ఆర్పిలు, వార్డు ఆఫీసర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అర్బన్ హౌసింగ్ కాలనీ, డబుల్ బెడ్రూం కాలనీలో మౌళిక సదుపాయా లు కరెంటు, నీళ్లు, డ్రైనేజీ వ్యవస్థ పూర్తి అయ్యాయని, లబ్ధిదారులకు కేటాయించిన ఇండ్లల్లో ఉండే విధంగా అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. వేసవి కాలం దృష్ట్యా పట్టణంలోని మొక్కల సంరక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై పురోగతి, పెండింగ్ పనుల ఆలస్యానికి కారణాలపై చర్చించారు. ఈ సమావేశంలో కమిషనర్



స్పందన, డిఈ నాగేశ్వర్ రావు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించిన కరీంనగర్ సిపి గౌష్ ఆలం




**చురకలు ప్రతినిధి కరీంనగర్ ఏప్రిల్ 29 :** కరీంనగర్ పోలీస్ కమీషనరేట్ కేంద్రంలోని కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం కరీంనగర్ పోలీసు కమీషనర్ గౌష్ ఆలం నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పోలీస్ కమీషనర్, పోలీసు అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.పిటిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను సరైన పద్ధతిలో అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు తమ పరిధిలోని పోలీస్ స్టేషన్లను తరచూ సందర్శిస్తూ సిబ్బంది పనితీరును పర్యవేక్షించాలని సూచించారు. డివిజన్ల వారీగా ఏసీపీ అధికారులు ప్రతి నెలా నేర సమీక్షలు నిర్వహించాలని తెలిపారు. సీసీసీ ద్వారా వచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యతనిచ్చి త్వరితగతిన పరిష్కరించాలని అన్నారు. ఆకస్మికంగా తలెత్తే శాంతిభద్రతల సమస్యలను ఎదుర్కొనేందుకు సిబ్బంది లాఠీలు, హెల్మెట్‌లు వంటివి సిద్ధంగా ఉంచుకోవాలని చెప్పారు.ఎస్ హెచ్ ఓలుగా విధులు నిర్వహిస్తున్న ఎస్సై, ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులు పోలీస్ స్టేషన్ మేనేజ్‌మెంట్‌ను సక్రమంగా నిర్వహించాలని, పోలీస్ స్టేషన్ మరియు పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. రికార్డుల నిర్వహణ సరైన పద్ధతిలో ఉండాలని, నమోదైన కేసుల వివరాలు సీసీటీఎన్ఎస్‌లో నమోదు చేయాలని సూచించారు. పెండింగ్ కేసులపై సమీక్ష నిర్వహించి, వాటికి గల కారణాలను తెలుసుకుని త్వరగా పూర్తి చేయాలని అన్నారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో స్వాధీనం చేసుకున్న వాహనాలను రికార్డుల్లో నమోదు చేయాలని, వదిలివేయబడిన వాహనాలను వేలం వేసేందుకు పై అధికారులకు తెలియజేయాలని చెప్పారు.రికార్డు నిర్వహణ, సీసీటీఎన్ఎస్, రిసెప్షన్, కోర్టు డ్యూటీ, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, బీట్, పెట్రోలింగ్, పాయింట్ బుక్‌ల ఏర్పాటు, సమన్ల జారీ వంటి విధులను సమర్థవంతంగా నిర్వహించాలని పోలీస్ సిబ్బందికి సూచించారు.డివిజన్‌ను సెక్టార్లుగా విభజించి, ప్రతి సెక్టార్‌కు ఏఎస్సై లేదా హెడ్ కానిస్టేబుల్‌ను ఇంచార్జ్‌గా నియమించాలని, తిరిగి సెక్టార్‌లను రెండు మూడు గ్రామాలతో కలిపి సబ్-సెక్టార్లుగా విభజించి వాటికి పోలీస్ కానిస్టేబుళ్లను కేటాయించాలని ఆదేశించారు. దీని ద్వారా క్షేత్రస్థాయిలో సమస్యలు తెలుసుకోవడంతోపాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించగలమని తెలిపారు.రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలని, వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలని, ప్రతి నెలా వారికి సంబంధించిన కొత్త సమాచారం సేకరించి నమోదు చేసుకోవాలని అన్నారు.గంజాయి రవాణా, అక్రమ ఇసుక రవాణా, పి.డి.ఎస్. బియ్యం అక్రమ రవాణా, పేకాట స్థావరాలను గుర్తించి వాటిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. గంజాయి నిర్మూలనలో భాగంగా స్థానిక పాఠశాలలు, కళాశాలల్లో యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేసి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.సైబర్ నేరాల సంఖ్య పెరుగుతున్నందున ప్రజల్లో వాటిపై అవగాహన పెంచాలని, పెండింగ్ వారెంట్లను అమలు చేయాలని ఆదేశించారు.రోడ్డు ప్రమాదాలపై చర్చించి, తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను బ్లాక్ హెూల్స్‌గా గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.కమిషనరేట్ వ్యాప్తంగా పోలీస్ స్టేషన్లకు, అధికారులకు కేటాయించిన వాహనాలను తనిఖీ చేసి వాటిని సక్రమంగా వినియోగించాలని, డ్రైవర్లకు ఎప్పటికప్పుడు సరైన శిక్షణ ఇవ్వాలని తెలిపారు.ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీ ఏ లక్ష్మీనారాయణ, రూరల్ ఏసీపీ శుభం ప్రకాష్ ఐపీఎస్, ప్రొబేషనరీ ఐపీఎస్ వసుంధర, అడిషనల్ ఎస్పీ నరేందర్, ఏసీపీలు వెంకటస్వామి (టౌన్), హుజురాబాద్ ఏసీపీ సిహెచ్ శ్రీనివాస్, యాదగిరి స్వామి (ట్రాఫిక్), శ్రీనివాస్ (ఎస్బి), మాధవి (ఫంక్షనల్ వర్టికల్స్), వేణుగోపాల్ (సీటీసీ), కాశయ్య (సీసీఎస్) లతో పాటు కమిషనరేట్‌లోని అన్ని విభాగాల, పోలీస్ స్టేషన్ల, సర్కిల్‌లకు చెందిన ఇన్‌స్పెక్టర్లు, హెడ్ క్వార్టర్స్ లోని అన్ని విభాగాల రిజర్వ్ ఇన్స్పెక్టర్లు ఎస్ హెచ్ ఓలు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

